మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ

మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

జఫర్‌గఢ్, మే 25 : దేశంలో కులాలు, మతాల మధ్య బీజేపీ చిచ్చుపెడుతూ మత విద్వేషాలు రెచ్చగొడుతున్నదని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి జువారి రమేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ సంపదను తమకు అనుకూలమైన కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నదన్నారు. దీంతో పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అన్నివర్గాల ప్రజలు చట్ట సభల్లోకి వెళ్లాలంటే దామాషా ఎన్నికల విధానం అమలులోకి తీసుకురావాలని రాజారెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 30, 31 తేదీల్లో జఫర్‌గఢ్‌లో జిల్లా స్థాయి శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సాయన్న, నాయకులు గట్టుమల్లు, ఎండీ జాఫర్, మంద బుచ్చయ్య, ఎండీ కలీల్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలి

ఎమ్మెల్యే యశస్వినీరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న శ్వేత

పాలకుర్తి, మే 25 : చారిత్రక నేపథ్యమున్న జనగామ జిల్లాకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని రజక సంఘాల సమన్వయ కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చిట్యాల శ్వేత మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి జనగామ జిల్లా పుట్టినిల్లు అని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించేందుకు జీవో జారీ చేసిందని ఆమె గుర్తు చేశారు. జనగామ జిల్లాకు ఐలమ్మ పేరు పెట్టేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరినట్లు శ్వేత తెలిపారు.

దేవరుప్పులలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

లింగాలఘనపురంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పట్టభద్రులంతా బీఆర్ఎస్ వైపే..

- ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ శ్రేణులు

దేవరుప్పుల, మే 25 : పట్టభద్రులంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తీగల దయాకర్ మాట్లాడుతూ ఉన్నత చదువులున్న రాకేశ్‌రెడ్డికి తమ మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. మండలంలో 1,862 మంది పట్టభద్రులు ఉన్నారని, వీరిలో 90శాతం ఓటర్లు రాకేశ్‌రెడ్డికే ఓటు వేస్తారని దయాకర్ అన్నారు. ఇటీవల తొర్రూరులో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి మండలం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లి రాకేశ్‌రెడ్డికి సంఘీభావం తెలిపారని ఆయన వివరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు లొడంగి వెంకన్న, పార్టీ శ్రేణులు బూత్కూరు అశోక్‌రెడ్డి, జోగు కిరణ్, ప్రదీప్, సాంబ్రాట్, అంబాల యాకన్న, చింత పరశురాములు, తోటకూరి కిష్టయ్య, తీగల సత్తయ్య, జోగు సోమనర్సయ్య, తోటకూరి దశరథ, తిరుమలేశ్, రెడ్డిరాజుల అబ్బసాయిలు, తోటకూరి కొమురయ్య పాల్గొన్నారు.

లింగాలఘనపురంలో..

లింగాలఘనపురం : ఉన్నత చదువులతోపాటు ప్రజల పక్షాన పోరాడే ఏనుగుల రాకేశ్‌రెడ్డికే పట్టభద్రులంతా ఓటేస్తారని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఏదునూరి వీరన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ బూత్ కమిటీ బాధ్యులతో కలిసి ఆయన పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో రైతులు, అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వీరన్న తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. నిరుద్యోగులు, విద్యావంతుల పక్షాన నిలబడి పోరాడే రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కేమిడి యాదగిరి, ఎడ్ల రాజు, బెజ్జం అశోక్, దిల్‌యాకూబ్, కేమిడి వెంకటేశ్, బెజ్జం చంద్రయ్య, బోయిని చినశ్రీను,ఎండీ ఆబిద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన శ్రీకాంత్‌గౌడ్

దేవరుప్పుల, మే 25: మండలంలోని పెదమడూరుకు చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ శనివారం సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కుటుంబ సభ్యులతో కలిసి కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్ తన సతీమణి బబ్బూరి రమాదేవి, కూతుళ్లు నక్షత్ర, రాఘవితారతో కలిసి కొద్దిసేపు కేసీఆర్‌తో మాట్లాడారు.

కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీకాంత్‌గౌడ్ కుటుంబ సభ్యులు

సంక్షేమ అధికారులపై ఆరోపణలు అవాస్తవం

జనగామ, మే 25 (నమస్తే తెలంగాణ) : జిల్లా అధికారులు (డీటీడీవోలు)కు సంక్షేమ అధికారులు పర్సంటేజీలు ఇస్తున్నారనే ఆరోపణల్లో నిజంలేదని గిరిజన సంక్షేమశాఖ జనగామ, హనుమకొండ జిల్లాల హెడ్‌మాస్టర్లు, వసతి గృహ సంక్షేమ అధికారులు స్పష్టం చేశారు. ఈమేరకు రెండు జిల్లాల సంక్షేమ అధికారులు శనివారం హనుమకొండలో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. రెండు జిల్లాల్లో వసతి గృహ సంక్షేమ అధికారులు, హెడ్‌మాస్టర్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో సరిపడా సిబ్బంది లేక అందుబాటులో ఉన్నవారికి అదనపు బాధ్యతలు అప్పగించారన్నారు. భారమైనప్పటికీ సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్న తాము జిల్లా అధికారికి ముడుపులు చెల్లిస్తామని వస్తున్న ఆరోపణల్లో నిజంలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అందుతున్న మెస్ చార్జీల ద్వారా మూడు పూటలా భోజనం అందించడం వసతి గృహ సంక్షేమ అధికారులకు భారంగా మారిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డీటీడీవోలకు, పై అధికారులకు పర్సెంటేజీలు ఇస్తున్నామని ఆరోపించడం సరైంది కాదన్నారు.

స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా వెంకన్న వార కల్యాణం

చిల్పూరు, మే 25 : మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వర స్వామి వార కల్యాణం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవమూర్తులను అలంకరించి వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా కొనసాగించారు. సాయంత్రం స్వామి వారికి అష్టోత్తర దీపారాధన కొనసాగించినట్లు ఆలయ ఈవో లక్ష్మీప్రసన్న తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది రమేశ్, వీరన్న, మల్లికార్జున్, రాజశేఖర్, మహేశ్, విశాల్, అజయ్, కృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

హనుమాన్ భక్తుల నగర సంకీర్తన

ఆగాపేటలో హనుమాన్ భక్తుల ర్యాలీ

నర్మెట, మే 25 : మండలంలోని ఆగాపేట, వెల్దండలో ఆంజనేయస్వామి భక్తులు శనివారం నగర సంకీర్తన నిర్వహించారు. హనుమాన్ మాలధారులు ఆగాపేటలో ఆంజనేయస్వామి విగ్రహంతో ర్యాలీ నిర్వహించి భక్తి గేయాలతో ర్యాలీగా వచ్చారు. వెల్దండలో హనుమాన్ భక్తులు భజన, భక్తి పాటలతో వీధుల్లోకి రావడంతో గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు.

'అబద్ధాల కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి'

బచ్చన్నపేట, మే 25 : గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చనందున ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పాలని బీజేపీ జిల్లా నాయకుడు సద్ది సోమిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పోచన్నపేటలో పట్టభద్రులను కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి, నాయకులు గణేశ్, సాంబయ్య, నగేశ్, మహేశ్, మల్లేశ్, సతీశ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

'మతతత్వ బీజేపీని ఓడించాలి'

నర్మెట, మే 25 : ఎమ్మెల్సీ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డీసీసీ జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి, భూక్యా జయరాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, యూత్ అధ్యక్షుడు పల్లె ప్రభుదాస్, నాయకులు గడ్డం వినోద్, మలిపెద్ది స్వామి, గొట్టె రాజశేఖర్, దొండకాయల కుమార్, పులి కనకయ్య, శ్రీను, కే బాలు, మల్లేశ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

జఫర్‌గఢ్, మే 25 : పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పట్టభద్రుల ఓటర్లు ఓటేసేలా రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఓటర్లకు అసౌకర్యం లేకుండా తాగునీరు, ఇతర వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అనిల్‌బాబు, కారోబార్ వివేక్‌సింగ్ పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయానికి బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

లక్ష్మాపూర్‌లో దుర్గామాతకు బోనాలు

బచ్చన్నపేట, మే 25 : మండలంలోని లక్ష్మాపూర్‌లో శనివారం దుర్గామాతకు మహిళలు బోనాలు సమర్పించారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. రెండు రోజుల ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గ్రామ దైవతలైన పోచమ్మ, ఎల్లమ్మ, మాతమ్మ, పెద్దమ్మకు బోనాలు సమర్పించారు. అనంతరం రాత్రి దుర్గామాత ఆలయం వరకు శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లతో భారీ ఊరేగింపుతో తరలివెళ్లి పూజలు చేశారు. వేడుకల్లో మాజీ సర్పంచ్ నూకల నవ్యానర్సిరెడ్డితోపాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, వాస్విక్ ఫౌండేషన్ వైస్‌చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి, పిడుగు కనకయ్య పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చేయాలి : ఎస్ఎఫ్ఐ

జనగామ చౌరస్తా, మే 25 : ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో 'ఫీజు నియంత్రణ చట్టం-ఆవశ్యకత' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ధర్మభిక్షం మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం విద్యను ప్రజలందరికీ ఉచితంగా అందించాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, విద్యావేత్తలతో కలిపి ఏటా జిల్లా కలెక్టర్ 'డిస్ట్రిక్ట్ ఫీ రెగ్యులేషన్' కమిటీని నియమించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్, టై, బెల్ట్ విక్రయాల పేరిట వేలాది రూపాయలను విద్యా సంస్థలు దోచుకుంటున్నాయని ధర్మభిక్షం తెలిపారు. ప్రతి పాఠశాలలో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దాసగాని సుమ, రమేశ్, యూనస్, అజయ్, విప్లవ్, శ్రీకాంత్, బొట్ల శ్రావణ్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Jammikunta Branch. I issue the following notice to general public. My client intends to grant to loan to Sannidhi Tanvi, D/o: Sannidhi Narsimha Swamy, Age: 23 years, Occ: Student, R/o: H.No. 2-172/3, Church Colony, Jammikunta village and mandal of Karimnagar dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

In Vacant land plot, deviod of any structure thereon in survey numbers 160/A/1/1, 161/A/1/2, 160/A/1/3, 160/A/2/1, 160/A/2/2, 160/A/2/3, 161/C, 161/D and 161/E, Plot number 421, to an extent of 200 Square yards or 167.226 Square meters, within the boundaries bounded on:

North: Plot No. 420
South: Plot No. 422
East: Plot No. 390
West: 30'-0" wide Road

Is situated Pamnoor village of Ghanpur (Stn) mandal of Janagaon dist.

Date: 25-05-2024
Sd/- **G. LAXMANA MURTHY,** Advocate
Huzurabad. Cell No. 94403 69866

యువతను మోసం చేసిన మోదీ

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్ ఘన్‌పూర్, మే 25 : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి యువతను మోసం చేస్తున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ నిరుద్యోగాన్ని పెంచారన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశవ్యాప్తంగా కేవలం 20లక్షల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేశారని శ్రీహరి ఆయన పేర్కొన్నారు. విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని మోదీ నెరవేర్చలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంపై బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీ వివక్ష చూపుతున్నారని, దీనికి కారణం ఏమిటో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు తెలుపాలని ఆయన డిమాండ్ చేశారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నా తెలంగాణకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఐదేళ్లుగా కేంద్ర మంత్రిగా ఉండి రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఏ మాత్రం సహకరించని బీజేపీకి తెలంగాణ ప్రజలు ఓటు ఎందుకు వేయాలని కడియం శ్రీహరి ప్రశ్నించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్

ముగ్గురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు

ధ్వంసమైన ఆర్టీసీ బస్సు వెనుక అద్దాలు

జనగామ చౌరస్తా, మే 25 : జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ స్కూల్ ఎదురుగా శనివారం మధ్యాహ్నం జనగామ బస్టాండ్ నుంచి ప్రయాణికులతో హనుమకొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓ టిప్పర్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. టీఎస్ 03 యూసీ 6155 నంబర్‌గల ఆర్టీసీ అద్దె బస్సు జనగామ బస్టాండ్ నుంచి హనుమకొండకు వెళ్తుండగా ఏపీ 29 డబ్ల్యూ 3266 నంబర్ గల టిప్పర్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో బస్సు వెనుక సీట్లో కూర్చున్న ముగ్గురు ప్రయాణికులకు తల, చేతులు, నడుము భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రెస్టన్ స్కూల్ ఎదురుగా బస్సును ఆపి ఎక్కుతున్న ఓ మహిళా ప్రయాణికురాలు కింద పడడంతో మోకాలుకు తీవ్ర గాయమైనట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ఈ ఘటనలో బస్సు వెనుక అద్దాలు ధ్వంసమయ్యాయి. దీనిపై బస్ డ్రైవర్ స్వామి జనగామ అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్

రైతులతో మాట్లాడుతున్న డీఏవో వినోద్‌కుమార్

లింగాలఘనపురం, మే 25 : విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ సూచించారు. మండలంలోని నేలపోగులలో శనివారం నిర్వహించిన రైతు అవగాహన శిబిరంలో ఆయన మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేస్తే వెంటనే సంబంధిత షాపులో రశీదులు తీసుకోవాలన్నారు. ఎంఆర్‌పీ కంటే డీలర్ ఎక్కువ ధరకు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు తీసుకుంటామని వినోద్‌కుమార్ వివరించారు. విత్తన పాకెట్‌పై విత్తన తయారీ, కాలం ముగిసే తేదీలు ఉంటాయని, వాటిని రైతులు చూసుకోవాలన్నారు. కాలం చెల్లిన విత్తనాలు డీలరు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పత్తి బోల్‌గార్డు-2 ప్యాకెట్ ధర రూ.864 మాత్రమేనన్నారు. రైతులు ఆ మేరకు డబ్బు చెల్లించి రశీదు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వర్లు, ఏఈవోలు శ్రీనివాస్, స్పంద న, అపూర్వ, సౌజన్య పాల్గొన్నారు.

దేవరుప్పలలో..

దేవరుప్పుల : నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి రైతులు మోసపోవద్దని వ్యవసాయ విస్తరణాధికారి సాగర్ అన్నారు. శనివారం మండలంలోని కామారెడ్డిగూడెంలో విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సాగర్ మాట్లాడుతూ బోల్‌గార్డ్-2 పత్తి విత్తనాలను అధీకృత విత్తన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలన్నారు. రశీదులను పత్తి అమ్మే వరకు జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. గ్రామాల్లో విడి విత్తనాలు ఎవరైనా అమ్మితే వ్యవసాయాధికారికి తెలుపాలని సాగర్ కోరారు. పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు వస్తే సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

రెండో రోజు ఫస్టియర్‌లో 355మంది, సెకండ్ ఇయర్‌లో 134మంది విద్యార్థుల హాజరు

జనగామ చౌరస్తా, మే 25 : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ థియరీ పరీక్షలు శనివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. రెండో రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఫస్టియర్ జనరల్ విభాగం పరీక్షకు 253 మంది, ఒకేషనల్‌కు 102 మందితో కలిపి మొత్తం 355 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్య అధికారి (డీఐఈవో) కే ఆంజనేయరాజు తెలిపారు. జనరల్, ఒకేషనల్ కలిపి 39 మంది గైర్హాజర్ అయినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించిన సెకండ్ ఇయర్ జనరల్ విభాగం పరీక్షకు 97 మంది హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 37 మంది కలిపి మొత్తం 134 మంది విద్యార్థులు హాజరుకాగా, 8 మంది జనరల్ విభాగం విద్యార్థులు మాత్రమే గైర్హాజర్ అయినట్లు ఆంజనేయరాజు తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జనగామ చౌరస్తా, మే 25 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర/బాలికల) జూనియర్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో మిగిలిపోయిన ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయ అధికారి, ప్రిన్సిపాల్ అలగోని నర్సింహులు గౌడ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాలురకు సంబంధించి జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ జూనియర్ కళాశాల, బాలికలకు పాలకుర్తి, జఫర్‌గఢ్, నర్మెట (ప్రస్తుతం చేర్యాల) జూనియర్ కళాశాలలు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పటేలుగూడెంలో వైద్యశిబిరం

లింగాలఘనపురం, మే 25 : మండలంలోని పటేలుగూడెం గుడిసెవాసుల కాలనీలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జనగామకు చెందిన మను మెటర్నటీ అండ్ జనరల్ హాస్పిటల్ నేతృత్వంలో నిర్వహించిన శిబిరంలో 268 మందికి వైద్యచికిత్స అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం మనస్విని, సీపీఎం నాయకులు మోకు కనకారెడ్డి, సింగారం రమేశ్, కాచం కృష్ణమూర్తి, నీళ్ల రమేశ్, కడారి శ్రీను, గుగ్గిల్ల సుధాకర్, నట్ట కుమార్, పాలమాకుల రవి, యాకన్న పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి

జనగామ రూరల్, మే 25 : అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని గానుగుపహాడ్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. బండిరాజుల ఆంజనేయులు కుమారుడు సంపత్(11) శనివారం బాత్‌రూమ్‌లో ఆడుకుంటున్న క్రమంలో చీర అతని మెడకు చుట్టుకుని మృతి చెందాడు. ఇదిలా ఉండగా సంపత్‌ను ఎవరైనా మందలించారా..? లేక పిల్లలతో ఆడుకుంటుండగా చీర మెడకు చుట్టుకుని మృతి చెందాడా..? అనేది సందేహంగా ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

- జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 23,419
- ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, మే 25 : వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న జరిగే ఉప ఎన్నికను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కోరారు. శనివారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి పోలింగ్ నిర్వహణపై ఎన్నికల నోడల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, అదర్ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడుత శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్‌రిజ్వాన్ బాషా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 23, 419 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందని